సాక్షి
చిత్తూరు
మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



నవరత్నాల పథకాలు బోర్డు ధ్వంసం
గంగవరం మండలం కీలపట్ల సచివాలయం గోడపై ఏర్పాటుచేసిన నవరత్నాల పథకాల బోర్డును ధ్వంసం చేశారు. - 8లో



కుప్పంలో టూరిజం అభివృద్ధి
కుప్పంలో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని అనంతపురం సీసీఎఫ్ నాగేశ్వరరావు తెలిపారు. - 8లో



ఉపాధి పనుల్లో జేసీబీల జోరు
శాంతిపురం మండలంలో తెలుగుతమ్ముళ్లు ఉపాధి హామీ పనులను జేసీబీలతో చేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

పోలీసు గ్రీవెన్స్‌కు 31 ఫిర్యాదులు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 31 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు, భూమి, ఆస్తి తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. వచ్చిన ప్రతి ఫిర్యాదుపైనా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ కూడా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

జెడ్పీ సీఈఓ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ సీఈఓగా రవికుమార్‌నాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా పంచాయతీరాజ్ ఎస్ఈగా శంకర్‌నారాయణ, ట్రాన్స్‌కో రూరల్ ఈఈగా సురేష్, టౌన్ డీఈగా ప్రసాద్, ఎస్‌పీఎం డీఈగా రవి బాధ్యతలు తీసుకున్నారు. వీరితో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా ట్రాన్స్‌కో పరిధిలో ఈఈలు 12 మంది, డీఈలు 22 మంది, ఏఈలు 50 మంది, జేఈలు 13 మంది, ఏఏఓలు ఐదుగురు, జేఏఓలు 14 మంది, సీనియర్ సహాయకులు 24 మంది, జూనియర్ సహాయకులు 16 మందికి స్థానచలనం కలిగింది. ఆర్అండ్‌బీ ఎస్ఈ ఉమమహేశ్వరరెడ్డి అమరావతికి బదిలీ కాగా, ఈఈ స్టాన్లీజోన్స్ స్థానంలో మదనపల్లె ఈఈ శ్రీనివాసులు నియమితులయ్యారు. డీఈ దస్తగిరి స్థానంలో తిరుపతి నుంచి నాగమల్లయ్య బదిలీపై వచ్చారు. మరో ఇద్దరు డీఈలు, ముగ్గురు ఏఈలు బదిలీ అయ్యారు. అటవీశాఖ వెస్ట్ ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి ఎస్ఎఫ్ బనగానపల్లెకు బదిలీకాగా, కదిరి నుంచి వెంకటసుబ్బుడు వచ్చారు. పలమనేరు ఎఫ్ఆర్వో శివన్న రాజంపేటకు వెళ్లగా అక్కడి నుంచి ఇక్కడికి నారాయణ వస్తున్నారు. వీరితో పాటు ఐదుగురు ఎఫ్ఎస్వోలు, ఒక జూనియర్ సహాయకుడు, 26 మంది ఎఫ్‌బీఓలు, 9 మంది ఏబీఓలు, 2 అటెండర్లు మారారు. పరిశ్రమలశాఖ డీఐఓ చంద్రశేఖర్ మంగళగిరికి బదిలీ కాగా, ఆయన స్థానంలో నంద్యాల నుంచి శ్రీనివాసయాదవ్ రానున్నారు. ఏడీగా కర్నూలు నుంచి వెంకటరెడ్డిని వస్తున్నారు. జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో సీనియర్ సహాయకులు 21 మంది, జూనియర్ సహాయకులు 32 మంది, అటెండర్లు 18 మంది బదిలీ అయ్యారు.

26, 30, 1 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 26, 30, అక్టోబర్ 1 తేదీల్లో స్కూల్ గేమ్స్ క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వసంతకుమారి తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. అండర్ 14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు ఈ నెల 26న అథ్లెటిక్స్ పోటీలు, 30న అండర్ -14 కింద బాలురకు క్రికెట్ పోటీలను చిత్తూరులోని మెసానికల్ మైదానంలో నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 1న అండర్- 17 బాలురు, బాలికలకు వాలీబాల్ పోటీలను గంగవరం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్‌గా చిట్టెమ్మ



కాణిపాకం: జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్‌గా చిట్టెమ్మను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె సోమవారం చిత్తూరు నగరంలోని జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆమె అనంతపురం జిల్లా ఉరవకొండ శ్రీగవి మఠం ఏసీగా పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మీ ప్రసన్న తిరుపతి జిల్లా సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయ ఈవోగా బదిలీ అయ్యారు.

గుడిపాలలో డెంగీ కేసు


గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లె దళితవాడలో డెంగీ కేసు నమోదుకావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. 189 కొత్తపల్లెకు చెందిన సురేష్‌బాబు(5)కు జ్వరం అధికంగా రావడంతో తల్లిదండ్రులు చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు చేసిన వైద్యులు బాలుడికి డెంగీ జ్వరం వస్తున్నట్టు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న గుడిపాల పీహెచ్‌సీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. సోమవారం 189 కొత్తపల్లె దళితవాడలో ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి దూర్వాసులు, సర్పంచ్ పెరిల్లా ఆధ్వర్యంలో ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయమ్మ, ఏఎన్ఎం సునీత, ఎంఎల్‌హెచ్‌పీ అనిత, ఆశా వర్కర్లు భాగ్యలక్ష్మి, లీలావతి పాల్గొన్నారు.

వైద్యంపై సమ్మెట

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేసింది. వినూత్న కార్యక్రమాలను అమలుచేసి పేదల ఇళ్ల వద్దకే వైద్యం అందేలా చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయాలని నిర్ణయించింది. తాజాగా పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులు పీజీ చదివేందుకు నిర్దేశించిన ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ జీవో 85ను తీసుకువచ్చింది. దీంతో ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న ఎంబీబీఎస్ వైద్యాధికారులు సమ్మెబాట పట్టారు. పీహెచ్‌సీల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలడంతో పేదలు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు



కాణిపాకం: చిత్తూరు జిల్లాలో మొత్తం 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ప్రతి కేంద్రంలోనూ ఇద్దరు వైద్యులను గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. వారితోపాటు ఇతర వైద్యులు కలిపి 135 మంది విధులు నిర్వహిస్తున్నారు. మారుమూల ప్రాంతంలో కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహిస్తున్నారంటే ప్రజల ప్రాణాలకు ఎంతగా ప్రాధాన్యం ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం పీహెచ్‌సీల్లో రోజుకు 7 వేల నుంచి 10 వేల మంది వరకు వైద్య చికిత్సలు పొందుతున్నారు. స్పెషలిస్టు డాక్టర్లు వచ్చేరోజు ఓపీల సంఖ్య మరింత పెరుగుతోంది. వీరంతా సామాన్య నిరుపేదలు, మధ్య తరగతికి చెందిన రైతులు, రైతు కూలీలు, ప్రజలు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వేలకు వేలు ఖర్చువేసే స్థోమత లేనివారు. వైద్యుల సమ్మెతో పీహెచ్‌సీల్లో వైద్యం కరువైంది.

ఉద్యోగోన్నతికి ఎసరు..?

జీవో రద్దుతో పాటు టైంబౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని పీహెచ్‌సీ వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో అసిస్టెంట్ సివిల్ సర్జన్లుగా ఉద్యోగంలో చేరిన వైద్యులు అదే హోదాలో రిటైర్డ్ కావడం ఆవేదనకు గురిచేస్తోంది. ఈ విధానం ఏ ప్రభుత్వ శాఖలోనూ లేదు. దీన్ని పీహెచ్‌సీ వైద్యులు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి అసిస్టెంట్ సివిల్ సర్జన్‌గా 6 ఏళ్లపాటు విధులు నిర్వహించిన వైద్యులకు డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత సివిల్ సర్జన్‌గా ప్రమోషన్ ఇవ్వాలని కోరుతున్నారు.

కిటకిటలాడుతున్న ప్రైవేటు ఆస్పత్రులు

జిల్లాలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రభుత్వ వైద్యం అందకపోవడంతో ప్రజలు అప్పులు చేసి ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి. ప్రైవేటు ఆస్పత్రుల్లో మామూలు జ్వరానికి కూడా రూ.10 వేల ఖర్చవుతోంది. రక్త పరీక్షలకే రూ.2 వేల నుంచి రూ.4 వేలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. డెంగీ లాంటి జ్వరాలకు రోజుకు రూ.10 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక వారం రోజులు ఆస్పత్రిలో ఉండి చికిత్స చేయించుకోవాలంటే కనీసం రూ.లక్ష ఖర్చు చేయకతప్పడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో అప్పులు చేయక తప్పడం లేదని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు.

డాక్టర్లు ఏమి చెబుతున్నారంటే..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యులు గతంలో పీజీ చేసుకునేందుకు వెసులుబాటు ఉండేది. గ్రామీణ ప్రాంతంలో మూడేళ్లు పనిచేసిన వైద్యులు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లు పనిచేసిన వైద్యులకు పీజీ చేసుకునేందుకు 30 శాతం కోటా ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం రాగానే 30 శాతం ఉన్న కోటాను 15 శాతానికి తగ్గిస్తూ జీవో నంబర్ 85 జారీ చేసింది. తమ భవిష్యత్తును దెబ్బతీసే జీవోను రద్దు చేయాలని కోరుతూ పీహెచ్‌సీ వైద్యులు ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించారు. ప్రయోజనం లేకపోవడంతో వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో పీహెచ్‌సీ వైద్యులు గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మె నోటీసు ఇచ్చారు. విధులు బహిష్కరించారు. అత్యవసర సేవలను మినహాయించి వైద్య సేవలను అందించకూడదని నిర్ణయం తీసుకున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం లెక్కచేయలేదు. ఈ నేపథ్యంలో వైద్యులు వారం రోజులుగా అత్యవసర సేవలను సైతం ఆపేసి పూర్తిస్థాయిలో పోరాటం చేపట్టారు.



శ్రీరంగరాజపురం: వైద్యుల కోసం రోగుల నిరీక్షణ



సమ్మె ప్రభావంతో బీఎన్ఆర్‌పేట పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

ప్రభుత్వ వైద్యం నిర్వీర్యానికి కుట్ర

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ వైద్యాన్ని నిర్వీర్యం చేయడం మొదలైంది. ఈ క్రమంలోనే ముందుగా స్పెషలిస్ట్ వైద్యులను తీసేశారు. నెల రోజులు కూడా తిరగకుండానే ప్రాథమిక వైద్యశాలల్లో వైద్యుల భవిష్యత్తును దెబ్బతీస్తూ జీవో నంబర్ 85ను విడుదల చేశారు. దీంతో పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టారు. వైద్యుల సమ్మెతో పీహెచ్‌సీల్లో వైద్యం ఆగిపోయింది. గ్రామాల్లో పీహెచ్‌సీలు ఉన్నప్పటికీ వైద్యం అందుబాటులో లేని దుస్థితికి తీసుకొచ్చారు. ఈ మొత్తం వ్యవహారాన్ని గమనిస్తే ప్రభుత్వానికి గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై ఏమాత్రం బాధ్యత లేదని తేటతెల్లమవుతోంది. అంతేకాకుండా గ్రామీణ వైద్యాన్ని దెబ్బతీసే కుట్రలు చేస్తున్నట్లు భావించాల్సి వస్తుందని ప్రజా సంఘాలు అనుమానిస్తున్నాయి.

భవిష్యత్తుపై దెబ్బ



జీవో 85ను రద్దు చేయాలి. దీనివల్ల మా భవిష్యత్తుపై దెబ్బపడుతుంది. ఇన్‌సర్వీస్ కోటాను 30 శాతం నుంచి 15 శాతానికి తగ్గించింది. గతేడాది వరకు 30 శాతం కోటా ఉండడంతో వందల సంఖ్యలో పీజీ కోర్సులకు వెళ్లారు. ఈ సంవత్సరం సగానికి తగ్గించారు. దీని కారణంగా 50 శాతం మంది మాత్రమే పీజీలకు వెళ్లారు. ఇది అన్యాయం.

– మోహన్‌క్రిష్ణ, వైద్యులు, పాలసముద్రం పీహెచ్‌సీ

వైద్యులకు మేలు చేయాలి



ప్రభుత్వం జీవో నంబరు 85 జారీ చేసి మా ఆశలపై నీరు చల్లింది. దీనివల్ల చాలా మంది వైద్యులు పీజీ చేయలేకపోతారు. అలాగే ఇన్‌సర్వీస్ కోటాను 30 శాతం నుంచి 15 శాతానికి తగ్గించడం దారుణం. ముందులాగే 30 శాతం కోటాను కొనసాగించాలి. పీహెచ్‌సీ వైద్యులకు ఇబ్బంది లేకుండా చూడాలి. తన నిర్ణయాన్ని పునః పరిశీలన చేయాలి. అలాగే గతంలో పీహెచ్‌సీలకు వస్తున్న స్పెషలిస్టులను మళ్లీ వచ్చేలా చూడాలి.

– లోకేష్, పీహెచ్‌సీ వైద్యులు పాలసముద్రం



సూర్యప్రభపై వినాయక స్వామి తేజసం

కాణిపాకం: ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సోమవారం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. విశేష అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై అధిష్ఠింపజేసి మంగళవాయిద్యాల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు చంద్రప్రభ వాహనం

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు మంగళవారం చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారని ఆలయ ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఉదయం అభిషేకం, రాత్రి చంద్రప్రభ వాహన సేవ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బాధ్యతతో అర్జీలు పరిష్కరించండి



కలెక్టర్ కు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను బాధ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవా రం గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వినతులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల వినతులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ వినతులు స్వీకరించారు.

హైకోర్టు ఆదేశాలను పాటించడం లేదు

విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పూతలపట్టు ఎంపీడీఓ, ఉపాధి హామీ ఏపీఓ అమలుచేయడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోయారు. వారు డ్వామా పీడీ రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన డ్వామా పీడీ రాజశేఖర్ 9 మందిని విధుల్లోకి తీసుకోవాలని పూతలపట్టు ఎంపీడీఓను ఆదేశించారు.

భయాందోళనకు గురిచేస్తున్నారు

గంగాధరనెల్లూరుకు చెందిన ఒక వ్యక్తి జర్నలిస్టు పేరుతో రెండేళ్లుగా తమను భయాందోళనకు గురిచేస్తున్నారని ప్రైవేట్ జూనియర్ కళాశాలల అసోసియేషన్ నాయకులు సురేంద్రరెడ్డి, సత్యనారాయణ, ప్రకాష్‌చంద్రారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చిత్తూరు నగరంలోని పలు కళాశాలల వద్దకు వచ్చి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని తెలిపారు. స్పందించిన కలెక్టర్ ఫోన్‌లో ఎస్పీతో మాట్లాడి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తాము 40 ఏళ్లుగా అటవీ భూముల్లో సాగు చేసుకుంటున్నామని, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని ఎస్ఆర్‌పురం మండలం మర్రిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన రైతులు జయచంద్ర, బాలాజీ కోరారు.

కొందరు తన ఇంటి స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, అడ్డుకున్నందుకు దౌర్జన్యం చేస్తున్నారని ఐరాల మండలం బలిజపల్లికి చెందిన సుబ్రమణ్యం వాపోయాడు. ఇటీవల ఇల్లు నిర్మించుకునేందుకు వేసిన పునాదులు కూల్చివేశారని చెప్పారు.

ఇదేం వివక్ష?

● భూమనపై అలా.. టీడీపీపై ఇలా ● పోలీసుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: టీటీడీలో సోమవారం చోటు చేసుకున్న ఘటనల్లో పోలీసులు వ్యవహరించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం చంద్రబాబు నాయుడు తిరుమల లడ్డూ ప్రసాదంపై చేసిన ఆరోపణలను టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తీవ్రంగా పరిగణలోకి తీసుకున్నారు. నెయ్యిలో ఎటువంటి పశువుల కొవ్వు కలపలేదని, తప్పు చేసి ఉంటే నాశనమై పోతామని, రక్తం కక్కుకుని చావాలని శ్రీవారి ఎదుట ప్రమాణం చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా భూమన సోమవారం సాయంత్రం తిరుమలకు చేరుకుని పుష్కరిణిలో స్నానం చేశారు. అనంతరం అఖిలాండం వద్దకు చేరుకుని కర్పూరం వెలిగించి ప్రమాణం చేయడం ప్రారంభించారు. ఈ పరిణామంతో భయపడిన ప్రభుత్వ పెద్దలు పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన తిరుమల డీఎస్పీ విజయ్‌శేఖర్, సీఐ విజయకుమార్, క్రైమ్ సీఐ శేషగిరి, ఎస్ఐ రమేష్‌బాబు భూమన కరుణాకరరెడ్డి మోకాలికి ఆపరేషన్ చేసుకుని అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసీ బలవంతంగా లాగి కారులో ఎక్కించారు. ఈ పెనుగులాటలో భూమన కాలు నొప్పి తీవ్రమైంది. మీడియాతో మాట్లాడమని విలేకరులు అడిగినా.. తిరుమలలో రాజకీయాలు మాట్లాడనని, అలిపిరి వద్ద మాట్లాడతానని చెప్పారు. అయినా పోలీసులు వినకుండా భూమనను చుట్టుముట్టి లాక్కెళ్లడం కనిపించింది. అలిపిరి వద్ద మీడియాతో మాట్లాడతారని తెలుసుకున్న పోలీసులు భారీగా మోహరించారు. అలిపిరి చేరుకున్న భూమనను కారు దిగనివ్వకుండా.. ముందూ వెనుక పోలీసు వాహనాలతో నివాసం వరకు తీసుకెళ్లారు.



తిరుమలలో భూమన కరుణాకరరెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

అలిపిరి వద్ద టీడీపీ నినాదాలు.. మీడియా సమావేశం



అలిపిరి వద్ద నినాదాలు చేస్తున్న టీడీపీ నాయకులు

భూమన కరుణాకరరెడ్డి ప్రమాణం చేయడంతో ఉలిక్కిపడిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ మరికొంత మంది టీడీపీ శ్రేణులు సోమవారం రాత్రి అలిపిరికి చేరుకున్నారు. అంతా గుమికూడడంతో పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సుగుణమ్మ, శ్రీధర్‌వర్మ వినిపించుకోలేదు. శ్రీధర్ వర్మ తాము మీడియాతో మాట్లాడాల్సిందేనని పట్టుబట్టారు. కుదరదని పోలీసులు బతిమలాడారు. అయినా వినిపించుకోలేదు. గోవిందా.. గోవిందా అంటూ అరిచి మీడియాతో మాట్లాడారు. ఒక్కొక్కరికి బైట్లు ఇచ్చి అధికార దౌర్జన్యాన్ని ప్రదర్శించారు. ఈ పరిణామాన్ని గమనించిన స్థానికులు అధికార పార్టీ నేతలు, పోలీసుల తీరుని తప్పుబట్టడం గమనార్హం.



గోవింద నామస్మరణ చేస్తున్న భూమన, ఎంపీ గురుమూర్తి, అభినయ్‌రెడ్డి

క్లుప్తంగా

బైక్ ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలు



బాలుడిని ఆస్పత్రికి తరలిస్తున్న బంధువులు

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ–చిత్తూరు రోడ్డులో ఉన్న పీహెచ్‌సీ సమీపంలో సోమవారం బైక్ ఢీకొనడంతో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ భారతి కథనం మేరకు.. సన్నగుంటకు చెందిన పి.ప్రభాకర్ కుమారుడు మహీధర్(9) అరుణోదయ ఇంగ్లీష్ స్కూల్‌లో చదువుకుంటున్నాడు. సోమవారం ఉదయం అమ్మమ్మతో కలిసి పాఠశాలకు బయలుదేరాడు. బలిజకండ్రిగ –చిత్తూరు రోడ్డులో ఉన్న పీహెచ్‌సీ సమీపంలో తమిళనాడు వాలాజకు చెందిన సురేంద్రన్ బైక్‌లో వస్తూ ఢీకొన్నాడు. మహీధర్ తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు బాలుడిని 108లో ఆస్పత్రికి తరలించారు. సురేంద్రన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పోలీసుల సాక్షిగా ఒక్కటైన ప్రేమ జంట



పోలీస్ స్టేషన్‌లో ఒక్కటైన ప్రేమజంట

నగరి : వారు ఇద్దరూ ప్రేమించుకున్నారు. మేజర్లు కావడంతో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అందుకు పెద్దలు నిరాకరించారు. దీంతో వారు జిల్లా ఎస్పీని ఆశ్రయించారు. ఎస్పీ సూచనల మేరకు నగరి పోలీసు స్టేషన్‌లో ఒక్కటయ్యారు. వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లికి చెందిన బాబ్జాన్ కుమార్తె దిల్షాద్ (24), రమణయ్య కుమారుడు జయప్రవీణ్ (24) బీటెక్ వరకు చదువుకున్నారు. వీరి మధ్య ప్రేమ చిగురించింది. ఇద్దరు మేజర్లు కావడంతో పెళ్లి చేసుకోవాలనుకున్నారు. వీరి ప్రేమకు మతాలు అడ్డు వచ్చాయి. పెద్దలు అంగీకరించలేదు. దీంతో ప్రేమజంట జిల్లా ఎస్పీ వీఎన్ మణికంఠ చందోలును ఆశ్రయించింది. ఎస్పీ వారి వివరాలు ఆరా తీసి జయప్రవీణ్ నగరి పరిసర ప్రాంతాల్లో ఉద్యోగి కావడంతో ప్రేమ జంటను ఒక్కటి చేసే బాధ్యతను నగరి సీఐ మహేశ్వర్‌కు అప్పగించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వారి భద్రతకు భరోసాను ఇచ్చారు. దీంతో ప్రేమ జంట ఒక్కటైంది.

ఆయనంటే భైరవులకు ప్రాణం!

మూగ జీవాలపై మనం కొంత ప్రేమ చూపిస్తే చాలు.. అవి మనపై అమితమైన ప్రేమను చూపుతాయి. మన కోసం ఎదురు చూస్తాయి. ముఖ్యంగా విశ్వాసానికి ప్రతీకలుగా నిలిచే కుక్కల సంగతి చెప్పాల్సిన అవసరం లేదు. పలమనేరుకు చెందిన వీవీ చలపతికి మూగ జీవాలు అంటే ఎంతో ప్రీతి. వాటికి ఏ కష్టం వచ్చినా తట్టుకోలేడు. వీధి కుక్కలు ఆహారం కోసం పడే బాధను చూసి చలించాడు. వాటికి ఆహారం అందించడం మొదలుపెట్టాడు. ఈ ప్రక్రియ పదేళ్లుగా కొనసాగుతోంది. ఆయన బైక్ శబ్దం వినపడగానే ఆయా ప్రాంతాల్లోని శునకాలు పరుగులు తీస్తాయి. అంతేగాక నిర్దిష్ట సమయంలో అక్కడ ఎదురు చూస్తూ ఉంటాయి. ఆయన చూపే ప్రేమకు రెట్టింపు ప్రేమను చూపుతూ ఆయన వెంట పరుగులు తీస్తాయి. కాళభైరవుల సేవలో తరిస్తున్న చలపతిపై ప్రత్యేక కథనం..

- పదేళ్లుగా వీధి కుక్కలకు ఆహారం
- నిర్దిష్ట సమయానికి ఆరు వీధుల్లో వేచి ఉంటున్న శునకాలు
- ఆయన బైక్ వెనుకే పరుగులు
- ఆ బండిని ఎవరైనా ముడితే భౌభౌమంటున్న వైనం



వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న చలపతి

పలమనేరు: పట్టణంలోని జిలానీ సర్కిల్‌కు చెందిన పీవీ చలపతి డిగ్రీ వరకు చదువుకున్నారు. చిన్న దుకాణాలకు డైలీ ఫైనాన్స్ ఇస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పదేళ్ల క్రితం తన ఇంటి వద్ద ఓ వీధికుక్క కాలికి గాయమై బాధపడుతుంటే చూసి జాలితో దాని కాలుకు కట్టుకట్టాడు. ఒక బిస్కెట్ ప్యాకెట్ వేశాడు. దాని కాలు బాగయ్యాక అది ఎంతో ప్రేమను చూపించడాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. అప్పటి నుంచి ఆయనకు మూగ జీవాలపై మమకారం పెరిగింది. తను నివాసం ఉన్న వీధిలో కొన్ని కుక్కలకు బిస్కెట్లు, పాలు, కోడిగుడ్లు పెట్టడం మొదలు పెట్టాడు. ప్రస్తుతం పట్టణంలోని జిలానీ సర్కిల్, రాధా బంగ్లా, చెరువుకట్ట, జనతాబజార్, బజారువీధి, కసాయివీధిలో దాదాపు వంద వీధికుక్కలకు నిత్యం ఆహారాన్ని అందిస్తున్నాడు.

నిర్దేశించిన చోట సమయానికి వేచి ఉంటున్న కుక్కలు

పట్టణంలోని ఆరు ప్రాంతాల్లోని కుక్కలు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 మధ్య, రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య ఆహారం కోసం వేచి చూస్తుంటాయి. చలపతి బైక్‌లో అక్కడికి చేరుకుని రెండుసార్లు హారన్ కొట్టగానే అతనిపైకి ఎగబాకుతాయి. ఒక్కో ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఆహారం అందించేందుకు అతను వెళ్లే వరకు రెండు, మూడు కుక్కలు ఎస్కార్ట్‌గా వెళ్లి వస్తుంటాయి. సాధారణంగా ఎప్పుడూ వాటికి ఆహారం అందించకుండా ఉండరు. ఒకవేళ ఏదైనా అత్యవసరమైతే వేరే వారిద్వారా అదే సమయానికి ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నాడు.

ఆయన బైక్‌ను ఎవరూ ముట్టుకోరు



చలపతి బైక్‌ను వెంబడిస్తున్న కుక్కలు

పట్టణంలోని పలు వీధుల్లో వీధి కుక్కలకు చలపతి తెలియందీ కాదు. ఆయన బైక్‌ను ఎక్కడ పెట్టినా అవి అక్కడే కాపుకాస్తుంటాయి. పొరబాటున ఎవరైనా ఆ బైక్‌ను ముట్టుకున్నా లేక తీసుకెళ్లాలని ప్రయత్నించినా వారికి గ్రహపాటు తప్పనట్టే. ఒకవేళ అతని స్నేహితులు ఆ బైక్‌ను తీసుకెళ్లినా తరుముకుంటాయి. దీంతో ఎవరూ ఆయన బైక్ జోలికి వెళ్లరు. తాను మూగ జీవాల ఆకలి తీర్చడమే కాదు పట్టణంలోని పలువురు మూగ జీవాలను ప్రేమించేలా స్ఫూర్తిని నింపుతున్నాడు. ఆయనను చూసి పలువురు ఆటో డ్రైవర్లు ఇప్పుడు కుక్కలకు ఆహారం అందిస్తున్నారు. కొందరు మహిళలు సైతం కుక్కలకు ఆహారాన్ని అందిస్తుండడం విశేషం.

ఎంతో సంతోషంగా ఉంటుంది

“ మనుషులకు సాయం చేసినప్పుడే కృతజ్ఞత చూపిస్తారు. అదే కుక్కలు అలా కాదు వాటి ప్రాణం ఉన్నంత వరకు మనపై మమకారాన్ని చూపుతాయి. నేను ఒక పూట తినకున్నా ఉంటాగాని వాటికి మాత్రం పెట్టకుండా ఉండను. ఎందుకంటే నేను వాటికి ఆహారాన్ని పెడతానని వేచి చూస్తూ ఉంటాయి. నేను పదేళ్లుగా వీధి కుక్కలకు ఆహారాన్ని అందిస్తున్నా. దీంతో నాకు మానసిక ప్రశాంతత లభిస్తోంది. ఆర్థికంగా కూడా బాగున్నా. మూగ జీవాలకు సాయం చేస్తే తెలుస్తుంది ఆ సంతోసం ఏమిటనేది.

– పీవీ చలపతి, పలమనేరు

రూ.13 లక్షల టపాకాయలు స్వాధీనం

పుంగనూరు: పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.13 లక్షల విలువైన టపాకాయలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన సోమవారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరు పట్టణంలోని భగత్ సింగ్ కాలనీ, నగిరివీధి, తాటిమాకులపాళెం ప్రాంతాల్లో అనుమతులు లేకుండా టపాకాయలను నిల్వ ఉంచినట్టు సమాచారం అందిందన్నారు. దీంతో తమ సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. రూ.13 లక్షల విలువైన టపాకాయలను సీజ్ చేశామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిత్తూరులో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2 లక్షలకు పైగా విలువ చేసే టపాకాయలను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ నెట్టికంటయ్య విలేకరులతో మాట్లాడుతూ తేనెబండలో అక్రమంగా టపాకాయలు నిల్వ చేశారనే సమాచారంతో తనిఖీలు చేపట్టామన్నారు. నరేష్ అనే వ్యక్తి ఇంట్లో పెద్ద ఎత్తున టపాకాయలు ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వాటి విలువ రూ.2.53 లక్షలు ఉంటుందని వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు ప్రాయశ్చిత్త శాంతి హోమం

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం ప్రాయశ్చిత్త శాంతి హోమం నిర్వహించనున్నట్టు ఈవో గురుప్రసాద్ తెలిపారు. లోక కల్యాణార్థం ప్రజల శ్రేయస్సు కోసం ఈ శాంతి హోమం ఉదయం 8 గంటలకు ప్రధాన ఆలయంలో జరుగుతుందన్నారు.

ప్లీజ్.. అమ్మను బతికించండి ..!

ఐరాల: 'కంటికి రెప్పలా కాపాడే మా అమ్మను క్యాన్సర్ వ్యాధి కబళించింది. పేదరికంలో ఉన్న మేము ఆమెకు వైద్యం చేయించే అంత స్తోమత లేదు. మాకు మా అమ్మ కావాలి.. దాతలు ఆపన్న హస్తం అందించి మా అమ్మను కాపాడండి. లేకపోతే మేము ఒంటరి వాళ్లమైపోతాం.. అందరికీ చేతులెత్తి మొక్కుతున్నాం.. ప్లీజ్ ప్లీజ్ అని' ఐరాల మండలం పాలకలరెడ్డివారిపల్లె దళితవాడకు చెందిన మోహన్, వంశీ వేడుకుంటున్నారు. పాలకలరెడ్డివారిపల్లె దళితవాడలో మునిరాజు, రజని దంపతులు నివాసం ఉంటున్నారు. మునిరాజు పుట్టినప్పటి నుంచి చెవుడు, మూగతో బాధపడుతున్నాడు. వారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మోహన్ తిరుపతిలోని ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం, రెండో కుమారుడు వంశీ ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. రజని కూలి పనులు చేస్తూ కుటుంబ భారం మోస్తోంది. 10 రోజుల క్రితం ఆమెకు క్యాన్సర్ సోకింది. సరైన వైద్యం చేయించుకోలేక, కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వికలాంగుడైన భర్తను చూసుకోలేక ఆమె ఆవేదన చెందుతోంది. వీరి కష్టాన్ని చూసి గ్రామస్తులు వైద్యం ఖర్చులకు తమకు తోచిన సాయం అందించారు. మెరుగైన వైద్యం అందిస్తే కాని ఆమె బతకదు. ఈ క్రమంలో మనసున్న దాతలు తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కుమారులు కోరుతున్నారు. రజని ప్రస్తుతం తిరుపతిలోని టాటా క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.



తిరుపతి టాటా క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రజని

దాతలు సంప్రదించాల్సిన వివరాలు

అకౌంటు నంబర్: 34751850188
రజని, ఎస్‌బీఐ, పాలకల బ్రాంచ్
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0006515
ఫోన్ పే నంబర్: 9573829003

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడిగా వినోద్‌కుమార్



చిత్తూరు కలెక్టరేట్ : హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడిగా చిత్తూరుకు చెందిన వినోద్ కుమార్ నియమితులయ్యారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన న్యూఢిల్లీకి చెందిన జాతీయ అధ్యక్షుడు గోపాల్‌దాస్ లాస్కరి, జాతీయ మహిళా జాగృతి అధ్యక్షురాలు తీతువర్మకు ధన్యవాదాలు తెలిపారు.

మునిసిపాలిటీల్లో అధికారుల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లాలోని పలు మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న రామకృష్ణుడును పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అధికారిగా, వైఎస్సార్ కడప కార్పొరేషన్‌లో పనిచేస్తున్న నాగేంద్రను చిత్తూరు అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా నియమించారు. చిత్తూరులో పట్టణ ప్రణాళిక అధికారులుగా పనిచేస్తున్న శారదను శ్రీకాళహస్తికి, జాకీరను బి.కొత్త కోట నగర పంచాయతీకి, పుంగనూరులో పనిచేస్తున్న సుభద్రదను చిత్తూరుకు, పుత్తూరులో పనిచేస్తున్న వంశీని తిరుపతికి, నగరిలో ఉన్న నీరజాక్షిని పుత్తూరుకు, పుత్తూరులో ఉన్న మూర్తిని నగరికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న టివి.గోమతిను తిరుపతికి, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఎస్.వెంకట్రామిరెడ్డిని చిత్తూరుకు బదిలీ చేశారు.

ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత

- మంగుంటలో మధ్యప్రదేశ్ బృందం
- శిక్షణ ఇచ్చిన జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి వాసు



మధ్యప్రదేశ్ అధికారులు, రైతులకు ప్రకృతి వ్యవసాయం గురించి వివరిస్తున్న జిల్లా అధికారి వాసు

శ్రీరంగరాజపురం : మధ్యప్రదేశ్ రాష్ట్రం వ్యవసాయ అధికారులు, రైతుల బృందానికి కేంద్రం ప్రవేశపెట్టిన అటల్ భూజల్ యోజన పథకం ద్వారా జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి వాసు ప్రత్యేక శిక్షణ అవగాహన కల్పించారు. మండలంలోని మంగుంట గ్రామంలో రైతు శేషాద్రి, ఝాన్సీ పండిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్ర అధికారులు, రైతులు సందర్శించారు. ఈ వాసు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పంట వేయకముందు నవధాన్యాలను పొలంలో చల్లి 40 రోజుల తరువాత కాయ, పిందె దశల్లో పొలంలో కలియదున్నుతారని తెలిపారు. అనంతరం వేరుశనగ, చెరుకు, వరి, కూరగాయల పంటలను పండిస్తారన్నారు. పంట అధిక దిగుబడి సాధించడానికి జీవామృతాన్ని నీటిలో కలిపి పారిస్తామని, ఘన జీవామృతాన్ని దుక్కిలో చల్లుతారన్నారు. పండించిన పంటలను టీటీడీ ధార్మిక సంస్థ రైతుల ఇళ్ల వద్దకే వచ్చి అధిక ధరలకు కొనుగోలు చేస్తారన్నారు. మధ్యప్రదేశ్ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణ కల్పించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామన్నారు. రసాయన వ్యవసాయం వద్దు–ప్రకృతి వ్యవసాయం ముద్దు అనే నినాదంపై విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్ఎమ్ సింగ్, వివేక్ మోర్, హరేధర్ సింగ్, రాంజీసింగ్, రాష్ట్ర ఆర్‌వైఎస్ఎస్ నాయకురాలు హుమయన్, కల్పన, పుష్ప, ఎన్ఎఫ్ఏలు నాంచారమ్మ, గురుప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో జేసీబీల జోరు

– తమ్ముళ్ల వర్గపోరుతో బట్టబయలు

శాంతిపురం: పనులు లేక వలస బాట పట్టే కూలీలకు కల్పించాల్సిన ఉపాధి పనులు తెలుగు తమ్ముళ్లకు కాసులు కురిపిస్తోంది. నిబంధనలకు పాతర వేసి జేబులు నింపుకుంటున్నారు. జేసీబీలతో పనులు చేయిస్తూ కూలీల కడుపు కొడుతున్నారు. ఈ వ్యవహారం టీడీపీ వర్గాల ఆధిపత్య పోరుతో వెలుగులోకి వచ్చింది. వివరాలు.. పంచాయతీ కేంద్రమైన సి.బండపల్లె వద్ద ఉన్న రాజుల చెరువులో స్థానిక తెలుగు తమ్ముడు ఒకరు ఆదివారం జేసీబీతో ఫిష్ పాండ్ తవ్వకం పనులు చేపట్టారు. కూలీలు పనులు చేస్తున్న స్థలానికి పక్కనే మెషినరీతో పనులు చేయడాన్ని గమనించిన అదే పార్టీకి చెందిన మరో వ్యక్తి ఫొటోలు తీసి ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్‌తో సహా అధికారులకు పంపాడు. విషయం బయటకు పొక్కడంతో అర్ధంతరంగా పనులకు స్వస్తి పలికి జేసీబీని పంపేశారు. దీనిపై ఉన్నత అధికారుల ఆదేశాలతో స్థానిక ఉపాధి హామీ ఏపీఓ తుపాకుల హరినాథ్ సోమవారం రాజులచెరువును సందర్శించారు. జేసీబీతో చేసిన పనులను పరిశీలించి కూలీలను విచారణ చేశారు. ఈ వ్యవహారంపై ఏపీఓను వివరణ కోరగా.. ప్రైవేటు వ్యక్తులు జేసీబీతో చెరువు నుంచి మట్టి తరలించే ప్రయత్నంలో వివాదం రేగిందని, ఆ పనులకు తమ శాఖతో సంబంధం లేదని పేర్కొన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి ఉపాధి పనులు చేస్తున్న చెరువుల్లోకి జేసీబీలను అనుమతించకుండా అన్ని శాఖల సమన్వయంతో ముందుకు పోతామన్నారు.



ఆదివారం కూలీలను విచారిస్తున్న ఏపీఓ హరినాథ్

నవరత్నాల పథకాలు బోర్డు ధ్వంసం

- టీడీపీ సర్పంచ్ పనేనంటూ వైఎస్సార్ సీపీ నాయకుల ఆరోపణ

గంగవరం: మండలంలోని కీలపట్ల గ్రామ సచివాలయం గోడపై గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న నవరత్నాల పథకాల బోర్డును టీడీపీ నాయకులు ధ్వంసం చేయడంపై వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ సర్పంచ్ చంద్రశేఖర్ దీనికి కారణమని పేర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో పేదలకు అందించిన పథకాలతో కూడిన బోర్డును సచివాలయం గోడపై ఏర్పాటుచేశారు. సచివాలయ సిబ్బంది శనివారం సాయంత్రం విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే సమయంలో సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి నుంచి తాళాలు తీసుకున్నారు. ఆదివారం ఉదయం సచివాలయం తాళాలు తీసి మిద్దెపై నుంచి తాళ్ల సాయంతో కిందికి దిగి గోడపై ఉన్న జగన్, నవరత్నాల పథకాల బోర్డును పగలగొట్టారు. ఇది సర్పంచ్ ఆధ్వర్యంలోనే జరిగిందని స్థానికులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నిలదీసినట్టు తెలిసింది. సర్పంచ్‌తో పాటు ఎస్ఎంసీ చైర్మన్ మురగేష్, పురుషోత్తం, వెంకటేష్, కిషోర్ కలిసి బోర్డును ధ్వంసం చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన చిత్రాలు, పథకాల బోర్డులను తొలగించాలని ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేవు. కావాలనే బోర్డులు ధ్వంసం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా గత ప్రభుత్వానికి సంబంధించిన పథకాల బోర్డులు తొలగించాలనే దానిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవన్నారు. పంచాయతీ స్థాయిలోనే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని, బోర్డు తొలగించడంపై తమకేమీ ఫిర్యాదు రాలేదన్నారు.

సైనికుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతిచెందిన సైనికుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న అధికారులు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ ఎన్ కల్లాడుకు చెందిన సైనికుడు చంద్రశేఖర్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి సోమవారం 21వ రెజిమెంట్ సుబేదార్ సోమసుందర్ మిలటరీ అధికారుల తరఫున రూ.1.64 లక్షల చెక్కును అందజేశారు. మరోవైపు పట్టణానికి చెందిన మాజీ సైనికుల సంఘం తరఫున ఆ సంఘం అధ్యక్షుడు పయణి రూ.1.12 లక్షలు ఇచ్చారు.

కుప్పంలో టూరిజం అభివృద్ధి

రామకుప్పం: కుప్పం నియోజకవర్గంలో అటవీశాఖ ఆధ్వర్యంలో టూరిజంను అభివృద్ధి చేయనున్నట్లు అనంతపురం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్) నాగేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం రామకుప్పం మండలం ననియాల ఎకో టూరిజం, సోలార్ పవర్ లైన్స్, ఎకో పార్కు, ఎలిఫెంట్ క్యాంపు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కుప్పంలోని పెద్దవంక కనకనాచమ్మ ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ అటవీ ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి గల అవకాశాలను చూశారు. ఆయన మాట్లాడుతూ కుప్పం అటవీ ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీనిపై ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఏనుగులు కుప్పం ప్రాంతం వైపు పదేపదే రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో చిత్తూరు డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి, ఎఫ్ఆర్ఓ జయశంకర్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ దరఖాస్తుకు గడువు పెంపు

తిరుపతి ఎడ్యుకేషన్ : 2025–26వ విద్యా సంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబరు 7వ తేదీ వరకు గడువును పొడిగించారు. ఆ మేరకు తిరుపతిలోని పోటీ పరీక్షల సమాచార కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలకు తమ కోచింగ్ సెంటర్‌లో నేరుగానీ, అలాగే 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సంబంధిత శాఖలు సమష్టిగా పనిచేయాలన్నారు. జిల్లాలోని జాతీయ రహదారి 69లో 84 కి.మీ పరిధిలో 11 బ్లాక్ స్పాట్‌లు ఉన్నట్లు తెలిపారు. అక్కడ స్పీడ్ లిమిట్, స్పీడ్ బ్రేకులు, కుడి, ఎడుమ మలుపులు తెలిపే సూచిక బోర్డులు, మలుపుల వద్ద సోలార్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారి 69లో ప్రమాదాలు జరిగి గాయపడిన వారికి రక్తాన్ని ఎక్కించేందుకు పత్తికొండ, గంగవరం, బంగారుపాళ్యం, చిత్తూరు, గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీల్లో అవసరమైన మేరకు రక్తం, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. రాత్రిళ్లు డాక్టర్లు ఉండేల చూడాలని డీఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు. ప్రమాదాల్లో మృతి చెందిన వారి ధ్రువీకరణ పత్రాలు, క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని ఆర్డీఓలు, తహసీల్దార్లకు సూచించారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారుల్లో 2019 నుంచి 2024 సెప్టెంబర్ వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 369 మంది మృతి చెందినట్లు తెలిపారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. మొగిలి ఘాట్‌లో ఇటీవల ప్రమాదం జరిగిన ప్రాంతంలో డివైడర్‌ను ఏర్పాటు చేస్తే ఓవర్‌టేక్‌కు అవకాశం ఉండదన్నారు. డీటీసీ నిరంజన్‌రెడ్డి, ఆర్‌టీఓ సునిల్‌కుమార్, ఎన్‌హెచ్‌పీడీ కార్తీక్ రెడ్డి, అధికారులు ప్రభావతి, చంద్రశేఖర్ రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, లక్ష్మీ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌లో ప్రజలను భాగస్వాములను చేయండి

చిత్తూరు కలెక్టరేట్ : స్వర్ణాంధ్ర విజన్ –2047లో ప్రజలను భాగస్వాములను చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర విజన్, ఉద్యానవన శాఖకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ –2047పై సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఇందుకోసం swarnandhra.ap.gov.in/suggestions లింక్‌ను ఓపెన్ చేయాలన్నారు. ఉద్యానవన రైతులకు ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవైలతో సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు, ఉపకరణాలు అందించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉద్యాన సమగ్రాభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్) కింద పండ్లు, పూలతోటలు, కూరగాయల విస్తరణ పథకం, విదేశీ, సంప్రదాయ విస్తరణ పథకాలకు 40 శాతం, ఫారం పాండ్ల ఏర్పాటుకు 50 శాతం, పాలీ హౌసులు, షెడ్ నెట్ హౌసులు, మల్చింగ్ ఏర్పాటుకు 50 శాతం, ఫారం మెకనైజేషన్‌లో చిన్న ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లకు 45–50 శాతం సబ్సిడీ ఇస్తున్నట్టు వివరించారు. ఈ పోస్టర్లను ప్రతి రైతు సేవా కేంద్రం, ఉద్యాన అధికారుల కార్యాలయం, అగ్రికల్చర్ అధికారి కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల నోటీస్ బోర్డుల్లో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, వ్యవసాయశాఖ అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, సీపీఓ సాంబశివారెడ్డి పాల్గొన్నారు.